సురక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యం

- అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- రైల్వే ప్రహరీపై కేంద్రమంత్రి చొరవతీసుకోవాలని వినతి



పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో తన బడ్జెట్ నుంచి నిధులు మంజూరు చేసి నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో నూతన డ్రైనేజీ, సీవరేజీ పైపులు ఏర్పాటు చేయిస్తున్నానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లో రూ.7 లక్షలతో నూతనంగా చేపట్టనున్న వాటర్ పైపులైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం అప్పటి అవసరాలకనుగుణంగా ఏర్పాటు చేయించిన డ్రైనేజీ, వాటర్ పైపులైన్ శిథిలావస్థకు చేరాయని, ఈ కారణంగానే చాలాచోట్ల లీకేజీలు ఏర్పడి తాగునీరు కలుషితమవుతోందన్నారు.

- నిత్యం నియోజకవర్గంలో పాదయాత్రలు చేపడుతున్న క్రమంలో స్థానికులు కలుషిత నీటి సమస్యలను తన దృష్టికి తీసుకొస్తున్నారని, వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు తయారు చేయించి యుద్ధ ప్రాతిపదికన నూతన పైపులైన్ పనులను చేపడుతున్నామన్నారు. అనంతరం బస్తీపెద్దలతో కలిసి ఎమ్మెల్యే పర్యటించగా.. స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

ప్రధాన సమస్యలు..

- బస్తీని ఆనుకుని ఉన్న రైల్వేట్రాక్‌కు రక్షణ గోడలు సరిగ్గా లేదు. ఈ కారణంగా విష పురుగులు సమీపంలోని ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయి. ట్రాక్ వెంట ఐరన్ ఫెన్సింగ్ వేయించాలి.
- బస్తీలో గుంతలమయంగా మారిన అంతర్గత రోడ్లతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వెంటనే ప్యాచ్‌వర్క్స్ చేయించాలి.
- బస్తీలోని పెద్దగల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు డ్రైనేజీ పైపులైన్ పనుల కోసం రోడ్డును తవ్విపోశారు. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా.. రోడ్లకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో పందికొక్కులు, ఎలుకలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని ఇళ్ల పునాదులు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేయించాలని కోరుతున్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బస్తీలో అంతర్గత రోడ్ల మరమ్మతులతో పాటు నూతన రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు.

కేంద్రం పరిధిలోకి వస్తుంది..

- ప్రజా సమస్యలన్నింటినీ విన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైల్వే ప్రహరీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది కాదని, కేంద్రం పరిధిలోకి వస్తుందని వివరించారు. రైల్వే అధికారుల అనుమతి లేకుండా ఆ స్థలంలో ఎవరూ కూడా ఎలాంటి మరమ్మతు పనులు చేయించకూడదని స్పష్టం చేశారు. ఈ సమస్యను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైల్వే అధికారుల నుంచి అనుమతులు తీసుకువచ్చేలా ప్రయత్నించాలని కార్పొరేటర్ అమృత, బస్తీపెద్దలకు ఎమ్మెల్యే సూచించారు.

అనుమతులు వస్తే పనులు సులభం..

- రైల్వే అధికారుల నుంచి అనుమతులు వస్తే ప్రహరీ ఫెన్సింగ్ ఏర్పాటుకు మార్గం సులభమవుతుందని తెలిపారు. దీనికి అవసరమైన నిధులు రైల్వే నుంచి మంజూరు చేయాలన్నారు. లేదంటే తన బడ్జెట్ నుంచి మంజూరు చేయిస్తానని చెప్పారు. జలమండలి డీజీఎం సన్యాసిరావు, బర్కత్‌పుర సెక్షన్ మేనేజర్ భావన, రత్నానగర్ బస్తీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఈశ్వర్, ఎంబీ. కిషోర్, నర్సింగ్‌రావు, సతీష్‌చంద్రగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రమణానాయుడు, భాస్కర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, బీజేపీ నాయకులు, బస్తీవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



రైల్వేట్రాక్ ఫెన్సింగ్ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కార్పొరేటర్‌కు వివరిస్తూ..

సాక్షి కథనంతో సమస్య పరిష్కారం..

సాక్షి ఎఫెక్ట్..

నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్ బస్తీలో గత కొంత కాలంగా డ్రైనేజీ పైపుల్లో లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమవుతోంది. స్థానికులు సమస్యను పలుమార్లు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో సమస్యను సాక్షి దృష్టికి తీసుకొచ్చారు. ఈనెల 12న ఈ సమస్యపై 'కలుషిత నీరు తాగేదెలా' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్–11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. టూరిజం హోటల్ ఫీడర్ పరిధిలో చప్పల్‌బజార్, బజాజ్ షోరూమ్, కాచిగూడ మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో 10.30 నుంచి 12.30, మౌలానా ఆజాద్‌నగర్ ఫీడర్ పరిధిలో గోల్నాక, కుమార్ థియేటర్, రహమత్‌బాగ్, క్వాలిటీ గార్డెన్ తదితర ప్రాంతాల్లో 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రకటించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువత ఉపాధి వైపు పయనించాలి



ఉచిత డ్రైవింగ్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువత ఉపాధి వైపు పయనిస్తూ.. అభివృద్ధి చెందాలని మాజీ ఎమ్మెల్యే ఏ.విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో కేశవ స్మృతి సంవర్ధన సమితి సహకారంతో, ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ శిక్షణ 7వ బ్యాచ్ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత చెడువైపు పయనించకుండా ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. సమితి అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ శ్రీరామ్‌రెడ్డి, సమితి ప్రధాన కార్యదర్శి బాలయ్య, కోశాధికారి రామచందర్, ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ యజమాని కె.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేస్ బీనా పాల్‌కు ఓయూ డాక్టరేట్



గ్రేస్ బీనా పాల్

కాచిగూడ: జువాలజీ లెక్చరర్ జక్కం గ్రేస్ బీనా పాల్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి జువాలజీలో పీహెచ్‌డీ పూర్తి చేసినందుకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఓయూ జువాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ ఎం.మాధవి నేతృత్వంలో 'వ్యవసాయ రంగంలో మొక్కలు, పూలు, పండ్లకు పడుతున్న తెల్లపురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉపయోగించాల్సిన ఔషధం' అనే అంశంపై పరిశోధనతో పీహెచ్‌డీ పూర్తి చేశారు. తెల్ల పురుగు నివారణకు ఉల్లంత, నీలిమర్రి మొక్కల ద్వారా తెల్ల పురుగు నివారణకు తన రిసెర్చ్ ద్వారా పరిష్కారాన్ని కనుగొన్నారు. రాష్ట్రంలోనే ఇలాంటి అంశంపై పరిశోధన చేయడం మొదటిసారి అని గ్రేస్ బీనా పాల్ తెలిపారు. తన రిసెర్చ్‌కు 2021లో జాతీయస్థాయిలో సెకండ్ బెస్ట్ ఓరల్ ప్రెజెంటేషన్ అవార్డు లభించిందన్నారు. గత 27 ఏళ్లుగా వివిధ అంశాలపై పరిశోధనలు చేస్తూ.. ఎన్నో అవార్డులను అందుకున్నారు.

'పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు శ్రద్ధ అవసరం'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది, కార్పొరేటర్ ఉమ

కాచిగూడ: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ సూచించారు. బుధవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో విద్యార్థులకు ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 16 ఏళ్ల నుంచి 18 ఏళ్ల పిల్లలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వారికి సరైన పోషకాహారం తీసుకోవాలని సూచనలు చేశారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మందులను అందజేశారు. డాక్టర్ పద్మజ, డాక్టర్ రామలక్ష్మి, రమేష్, రమ్య, బీజేపీ నాయకులు సుభాష్‌పటేల్, శీర్‌సాగర్, కృష్ణకుమార్, నర్సింగ్‌రావు, మల్లికార్జున్, బల్వీర్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్ తదితరులున్నారు.

బీసీల సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లండి



కాచిగూడ: బీసీల సమస్యను ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపాలని తెలుగు బీసీ ప్రజాసంక్షేమ సంఘం అధ్యక్షుడు జోర్రిగల శ్రీధర్ కోరారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఆనంద్‌గౌడ్ నియమితులైన సందర్భంగా బుధవారం తెలుగు బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు జోర్రిగల శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా పార్టీ కార్యాలయంలో కలిసి అభినందించారు. పార్లమెంట్‌లో బీసీబిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించేలా పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు.

బీజేపీలో చేరిన మాజీ కార్పొరేటర్



రవీందర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

కవాడిగూడ: దోమలగూడ మాజీ కార్పొరేటర్ రవిందర్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి బుధవారం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం కవాడిగూడలో ఆయన మాట్లాడుతూ.. 2002 నుంచి 2007 వరకు దోమలగూడ కార్పొరేటర్‌గా కొనసాగానని, కొన్ని రాజకీయ పరిస్థితుల కారణంగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు ఆయన వివరించారు. తన రాజకీయ గురువు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆహ్వానం మేరకు బీజేపీ పార్టీలో చేరినందుకు సొంత ఇంటికి వచ్చిన భావన కలుగుతుందని పేర్కొన్నారు. బీజేపీ పార్టీ అభివృద్ధికోసం శక్తి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, నగర కార్యవర్గసభ్యులు భువనగిరి శేఖర్, కవాడిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గంగపుత్ర, సీహెచ్. శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులున్నారు.

మత రాజకీయాలను తిరస్కరించాలి



మాట్లాడుతున్న మద్దికాయల అశోక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో మత రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్‌భవన్‌లో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మతపరమైన రాజకీయాలకు పూనుకుంటుందని విమర్శించారు. గత పదేళ్లుగా కార్పొరేట్, పెట్టుబడిదారుల ఆర్థిక విధానాలతో పాటు మతోన్మాద విధానాలతో పాలిస్తూ.. దేశ ప్రజలపై తీవ్రమైన ఆర్థికభారాన్ని మోపుతుందని ఎద్దేవ చేశారు. రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, జబ్బర్ నాయక్, పల్లెపు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, మట్టయ్య, తుకారామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్నతో అరుదైన గౌరవం



నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట్: బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించడం చారిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం అంబర్‌పేటలో ఆయన శతజయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వడం దేశంలోని 70 కోట్ల బీసీలకు దక్కిన గౌరవమన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్, శ్యాంకుర్మ, బడేసాబ్, జాజుల లింగం, మహేష్ యాదవ్ తదితరులున్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో వసతులు కల్పించాలి



కట్ట బబ్లుగౌడ్

ముషీరాబాద్: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక అరకొర వసతులతోనే నెట్టుకొస్తున్నారని సరైన సౌకర్యాలు కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్ట బబ్లుగౌడ్ అన్నారు. ఈ మేరకు విద్యార్థుల సమస్యలపై బుధవారం పత్రికా ప్రకటన ద్వారా ఆయన స్పందించారు. పేద విద్యార్థులకు మౌలికవసతులతో పాటు విద్యలో మెలకువలు పాటించి, ఉన్నతంగా రాణించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన వసతి గృహాల్లో నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రస్‌లుగా మారాయన్నారు. వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. వీటి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరబడిందని తెలిపారు. గత ప్రభుత్వం బీసీ విద్యార్థుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి బీసీకమిషన్ ద్వారా విద్యార్థుల సౌకర్యాలను హాస్టల్‌లో అభివృద్ధికి మెస్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించిందన్నారు. బీసీ విద్యార్థుల కోసం ఫీజు రియంబర్స్‌మెంట్, హాస్టల్‌మెస్, వార్డెన్ రిక్రూట్‌మెంట్ విద్యార్థుల సౌకర్యాల కోసం కోట్లాది రుపాయల నిధులను కేటాయించిందన్నారు. రాష్ట్ర 2023 సార్వత్రిక ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి రాగానే బీసీ వసతి గృహాలు విద్యార్థులు అంధకారంలోకి వెళ్లిపోయాయని విమర్శించారు. సరైన సౌకర్యాలు లేక సన్నబియ్యం అందక సరైన దుప్పట్లు, సమయానికి భోజనం లాంటి ఎన్నో సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీసీలకు బీసీ విద్యార్థుల కోసం ప్రత్యేకమైన కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పిన నేతలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బీసీ విద్యార్థుల కోసం వసతి గృహాల్లో తక్షణమే తాగునీటి సమస్యను తీర్చాలని లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

28 నుంచి శతహనుమాన్ చాలీసా కార్యసిద్ధి హోమం

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకు అష్టోత్తర శత హనుమాన్ చాలీసా సహిత శ్రీమత్ సుందర కాండ కార్యసిద్ధి హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మాచర్ల దేవనాథం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తుల క్షేమం, లోక కల్యాణార్థం, వివాహం, నవగ్రహదోష నివారణ, ఉద్యోగ ప్రాప్తి, పదోన్నతి, వ్యాపారాభివృద్ధి, సంపూర్ణ ఆరోగ్యసిద్ధికి మహిమాన్వితుడైన ఆంజనేయస్వామి సంపూర్ణ అనుగ్రహం కోసం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.

హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అయోధ్యలో శ్రీరామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పద్మకాలనీలో సమర్థ కామధేను గోశాల ప్రవక్త వెంకటరమణ, డీజీఈ లింగప్రకాష్ గుప్తల ఆధ్వర్యంలో బుధవారం హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద అందజేశారు. ఈ కార్యక్రమంలో మాతా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మురళీధరుడు, ఉపాధ్యక్షులు నీలా శ్రీధర్, ముఖ్య సలహాదారులు రామలింగేశ్వర్‌రావు, రామకృష్ణ, కేశవరావు దేశ్‌పాండే, అల్లాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ న్యూబాకారంలో 1-3-183/40/46/9 స్థలంలో జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం చేపట్టిన యజమానులపై చర్యలు తీసుకోవాలని భోలక్‌పూర్ డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్ తాహా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులను కోరారు. బుధవారం భోలక్‌పూర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి జీ ప్లస్ టూ అనుమతులు తీసుకుని జీ ప్లస్ ఫోర్ నిర్మించారని పేర్కొన్నారు. సెట్‌బ్యాక్ లేకుండా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి భవన నిర్మాణపనులు చేపట్టడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు నోటీసులు అందజేసినా భవన నిర్మాణ యజమాని పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ డిమాండ్ చేశారు.

కాటికాపరి వృత్తిని మాలలకే కేటాయించాలి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన మాల వారియర్స్ సంఘం

కవాడిగూడ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శ్మశాన వాటికలలో కాటికాపరి వృత్తిని మాల సామాజికవర్గానికే కేటాయించాలని కోరుతూ.. బుధవారం మాల వారియర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వారియర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగ శ్రీనివాస్ మాట్లాడుతూ... గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పటికే నగరంలోని అతిపెద్ద మహాప్రస్థానం వంటి శ్మశానవాటికలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పారని, దీంతో మాలలు కులవృత్తి కోల్పోయారని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచించి శ్మశానవాటికలలో అనాధిగా కులవృత్తిగా కొనసాగుతున్న కాటికాపరి వృత్తిని మాలలకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించేలా కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మాల వారియర్స్ అధ్యక్షుడు కేశవ్, తెలంగాణ మాల బ్యాగరి కాటికాపరి శ్మశానవాటిక సంఘం నాయకులు దుర్గయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

టీపీజేఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు గౌరీ సతీష్




మాట్లాడుతున్న గౌరీ సతీష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కాలేజీలకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజ్ మెనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీజేఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు గౌరీ సతీష్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీజేఎంఏ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ప్రైవేటు జూనియర్ కాలేజీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న కళాశాలలకు ఫైర్ ఎన్ఓసీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. ఇంటర్మీడియట్ ట్యూషన్ ఫీజును ప్రస్తుత ధరల సూచికను బట్టి నిర్ణయించాలన్నారు. కార్పొరేట్ కళాశాలల విధానాలను నియంత్రించాలని, కార్పొరేట్ కళాశాలల దోపిడిని అరికట్టాలని కోరారు. ప్రజా ప్రభుత్వం వచ్చినందున తమ సమస్యలను పరిష్కారం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 30వన టీపీజేఎంఏ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఏ.వరదారెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, అధికార ప్రతినిధి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.వీరారెడ్డి, కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ నరేందర్‌రెడ్డి, డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

కాచిగూడ: ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్.సుజిత్‌గాంధీ ఆధ్వర్యంలో ఫీవర్ ఆస్పత్రి వైరాలజీ ల్యాబ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది, 18 మంది టెక్నికల్ స్టాఫ్ బుధవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది, టెక్నికల్ స్టాఫ్‌కు యూనియన్‌లో సభ్యత్వం ఇచ్చారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వంతో చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మహంకాళి ఆలయ నిర్మాణానికి విరాళం



ముషీరాబాద్: భోలక్‌పూర్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి అమ్మవారి దేవాలయ అభివృద్ధికి దివంగత నేతలు సత్తయ్య యశోదమ్మల జ్ఞాపకార్థం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అనీష్‌గంగపుత్ర రూ.50 వేలు విరాళం అందజేశారు. బుధవారం బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహను కలిసి ఆలయ కమిటీకి ఆయన చేతుల మీదుగా నగదును అందజేశారు. ఈ సందర్భంగా జైసింహ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని, అమ్మవారి దేవాలయ నిర్మాణానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ బైరు గోవింద్‌రాజ్, గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగేందర్, సంఘం నాయకులు బాబురావు, కొండల్, అభిషేక్‌రెడ్డి తదితరులున్నారు.

వైభవంగా పుష్పార్చన



పుష్పార్చనలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తదితరులు

కవాడిగూడ: సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీద్ధేశ్వర పీఠం కూర్తాళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటిపత్యాంగిర మహాయాగం బుధవారం 4వ రోజుకు చేరుకుంది. ముఖ్య అతిథిగా హాజరైన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వామి వారికి పుష్పార్చన చేశారు. అనంతరం స్వామివారు భక్తులకు అనుగ్రహభాషణం చేయగా.. వారి భాషణంతో భక్తులు తన్మయం చెందారు. రమ్యానంద భారతి స్వామిని, పీఠం కో- ఆర్డినేటర్ శ్రీనివాస్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మాచర్ల శశిభూషణ్‌తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు.

ఇంగ్లిష్‌పై రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ తరగతులు




అంబర్‌పేట్: బడ్జెట్ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఇంగ్లిష్‌లో నైపుణ్యాన్ని పెంచేందుకు ట్రాస్మా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ట్రాస్మా రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీ సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ, నిసా, బోలో ఇంగ్లిష్ సంస్థల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. శిక్షణలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను సహితం అందజేస్తామన్నారు. nira@niraindia.org కి మెయిల్ చేయాలని ఆయన కోరారు.

శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు కల్పించాలి

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ బాలాజీనగర్ శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు తిరుమల్ డిమాండ్ చేశారు. బుధవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డీఎంసీ తిప్పర్తి యాదయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటిక మొత్తం వ్యర్థాలతో నిండి ఉందని తాగునీటి సౌకర్యం లేదని, అంత్యక్రియలు నిర్వహించేందుకు వచ్చిన వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.

కళాకారులకు ఆదర్శప్రాయుడు సత్యదేవ్



చిక్కడపల్లి: నిరాడంబరంగా కనిపించే సత్యదేవ్ కీబోర్డు కళాకారుడిగా అసమాన ప్రతిభకల వారని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు. ఆయన వ్యక్తిత్వం కళాకారులకు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని లలిత కళావేదికపై ప్రముఖ మహిళా సాంస్కృతిక సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో 'అంతారామమయం' శీర్షికన ప్రముఖ గాయని ఎం.వీ.రమణకుమారి, శాంతకుమారి, లక్ష్మీకాంతి, దినకర్, కనకల గాన విభావరి అలరించింది. ఈ సందర్భంగా ప్రముఖ కీ బోర్డు కళాకారుడు సత్యదేవ్‌ను సత్కరించారు. అనంతరం పార్వతీశం మాట్లాడుతూ.. తాము సహ గాయనీలకు వేదిక కల్పిస్తున్న రాగ రాగిణి సంస్థ సోదరీ మణులు అభినందనీయులన్నారు. రాముడు మనవమాత్రుడే కానీ ఆయన మానవ జాతికి ఆదర్శపురుషుడు అని కొనియాడారు. ప్రముఖ గాయకుడు త్రినాథరావు అధ్యక్షత వహించిన సభలో సంస్థ కార్యదర్శి సుబ్బులక్ష్మి నివేదిక సమర్పించారు.